తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# నేడు గంగమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతం

తిరుపతి, ఆగస్టు 20 ప్రభాతవార్త:




తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గం గమ్మ ఆలయంలో నేడు ఉదయం వర లక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్ యాదవ్, ఈఓ జయకుమార్ తెలి పారు. వరలక్ష్మి వ్రతం సందర్భం గా ఉదయం 5గంటలకు అమ్మవారికి అభిషేకము చేసి వజ్రకిరీటము ,బంగారు ముఖబింబములతో అమ్మ వారికి అలంకరిస్తారు. సౌభాగ్యాలకు ప్రతీకలైన గాజుల తో పుష్పాలతో అమ్మవారిని అలంకరిస్తారు.నేటి ఉదయం 9గంటల నుండి సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి ఆశీస్సులను పొందాలని ఆలయ వర్గాలు కోరాయి.

## గడువులోపు
# ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

- నోటీసులు జారీ, హియరింగ్స్, క్లైయిములు, అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఎలక్ట్రోరల్ పరిశీలకులు, బిసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున



చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త:

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోపు నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా ఎలక్ట్రోరల్ పరిశీలకులు, బిసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టరేట్ నుండి జిల్లా ఎలక్ట్రోరల్ పరిశీలకులు మల్లికార్జున గురువారం ఆర్డీఓలు, ఎంపిడిఓలు, ఏఇఆర్ఓలు, ఇఆర్ఓలు, బిఎల్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ప్రక్రియను సమీక్షించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించడానికి మూడు దశల్లో పర్యటనలు వుంటాయని, ప్రస్తుత పర్యటన మొదటి దశలో భాగం అన్నారు. తన పర్యటనలో జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలా జరుగుతుంది! రాజకీయ పార్టీల నుండి వచ్చిన సూచనలు ఏమిటీ! క్షేత్ర స్థాయిలో బిఎల్ఓలు, ఎఇఆర్ఓలు నిర్వహిస్తున్న విధులు, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హియరింగ్స్, క్లైములు, అభ్యంతరాలు, ఫారాల పరిష్కారం వంటి అంశాలను పరిశీలించడం పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు.ఎఇఆర్ఓలు నోటీసులకు సంబంధించి హియరింగ్స్ను తప్పనిసరిగా నిర్వహించి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరుగరాదని, నిర్ణీత గడువులోపు పని పూర్తి చేయకుంటే తదుపరి షెడ్యూల్‌పై ప్రభావం పడే అవకాశం వుంటుందన్నారు. జిల్లాలో సుమారు 20 వేల నోటీసులు డెలవరీ కావాల్సి వుందని, కుప్పం నియోజకవర్గంలో ఈ సంఖ్య ఎక్కువగా వుందని, అలాగే పుంగనూరు, జిడినెల్లూరు, పలమనేరు నియోజకవర్గాల్లో నోటీసుల డెలవరీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆగస్టు 22 తేదీని గడువుగా తీసుకుని పెండింగ్‌లో వున్న నోటీసులన్నింటినీ డెలవరీ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లు పాల్గొనగా అర్డీఓలు, ఎంపిడిఓలు, ఏఇఆర్ఓలు, ఈఆర్ఓలు, బిఎల్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# తిరుపతి మేయర్ పీఠంపై "చంద్ర"వ్యూహం!

## క్లీన్ ఇమేజ్ ఉన్న విద్యావంతుడైన యువ నేత కోసం అన్వేషణ



ప్రభాతవార్త-తిరుపతి:

ప్రతిష్టాత్మకమైన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా సిఎం,టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వ్యూహరచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అభ్యర్థిని మేయర్‌గా గెలిపించేందుకు ఇప్పటి నుండే అభ్యర్థి ఎంపికపై దృష్టి సారించినట్లు సమాచారం. 2021లో జరిగిన గత తొలి మేయర్ ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో 48 స్థానాలను వైసిపి అభ్యర్థులు గెలుచుకోగా, టిడిపి ఒక డివిజన్‌లో విజయం సాధిం చింది. మరో డివిజన్‌కు ఎన్నిక నిలిచిపోయింది. మేయర్ స్థానం జన రల్ మహిళకు రిజర్వ్ అయినప్పటికీ వైసిపినుండి డాక్టర్ ఆర్ శిరీష యా దవ్‌ను మేయర్‌గా ఎన్నుకుంది. ప్రస్తుతం మేయర్ పదవికి రిజర్వేషన్ మారే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఈసారి మేయర్‌కు ప్రత్యక్ష ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో అభ్యర్థి ఎంపిక మరింత కీలకంగా మారనుంది. అధికార కూటమి తరపున బలమైన, ప్రజాదరణ కలిగిన అభ్యర్థిని బరిలోకి దించాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### గ్రేటర్ తిరుపతిపై ప్రతిపాదనలు

1886 ఏప్రిల్ 1న మున్సిపాలిటీగా ఏర్పడిన తిరుపతి, 2007 మార్చి 2న మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించింది. వివిధ కారణాలతో ఎన్నికలు ఆలస్యమై 2021లో కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి.తిరుపతి పరిసర ప్రాంతాల్లోని 68 పంచాయతీలను విలీనం చేసి గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే దిశగా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోతే ప్రస్తుత పరిధిలోనే డివిజన్ల సంఖ్యను 66కు పెంచి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### -యువతకు అవకాశం:

తిరుపతి వంటి ఆధ్యాత్మిక, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న నగరానికి మేయర్‌గా విద్యావంతుడు, సామాజిక స్పృహ కలిగిన, వివాదరహిత నేపథ్యం ఉన్న యువ నాయకుడిని ఎంపిక చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తిరుపతి ఎమ్మెల్యేగా బలిజ సామాజిక వర్గానికి చెందిన జనసేన నేత ఆరణి శ్రీనివాసులు కొనసాగుతున్న నేపథ్యంలో, మేయర్ అభ్యర్థిగా రెడ్డి లేదా బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడికి అవకాశం ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా నగర రాజకీయాల్లో రౌడీయిజం, వర్గ రాజకీయాలకు తావులేకుండా రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సామాజిక బాధ్యత పట్ల అవగాహన ఉన్న విద్యావంతుడు, క్లీన్ ఇమేజ్ కలిగిన యువ నాయకుడి కోసం అన్వేషణ జరుగుతున్నట్లు సమాచారం. అయితే మేయర్ పదవికి రిజర్వేషన్, ప్రత్యక్ష ఎన్నికల విధానం, డివిజన్ల పునర్విభజన తదితర అంశాలపై ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయాల తర్వాతే రాజకీయ సమీకరణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## డయాలసిస్ సెంటర్
# ఏర్పాటు చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త:

నియోజకవర్గంలో డయాలసిస్ చేయించుకునే రోగులను దృష్టిలో ఉంచుకొని సూళ్లూరుపేటలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 185 మంది డయాలసిస్ రోగులు ఉన్నారని వీరు ప్రభుత్వం ద్వారా అందే పెన్షన్ కూడా తీసుకుంటున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పులికాట్ సరస్సు సమీపంలో ఉండడంతో అధిక భాగం ఉప్పు నీరు కలసిన నీరుతీసుకుని ప్రజలు కిడ్నీ రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇందుకు తగ్గట్టుగా ప్రస్తుతం ఏర్పాటు అయి ఉన్న సెజ్‌ల వల్ల నీరు కలుషితం అవుతుందని ఆమె తెలిపారు. అలాగే డయాలసిస్ చేసుకోవాలంటే సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన వారు చెన్నై నెల్లూరు తిరుపతిలకు వెళ్ళవలసి ఉంటుందని ఎటు వెళ్లిన 100 కిలో మీటర్ల దూరం ఉంటుందని దీంతో వీరికి ఆరోగ్య, ఆర్థిక వనరుల దృష్ట్యా కొంత కష్టతరంగా ఉందని ఆమె తెలిపారు. డయాలసిస్ రోగులు అవసరాన్ని బట్టి వారానికి రెండు రోజులు డయాలిసిస్ కు వెళ్ళవలసి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సమస్యను సానుభూతితో పరిశీలించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించడం జరిగిందని, ఆసుపత్రిలోని రోగులకు భోజన వసతిని కూడా ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగు తుందని తెలిపారు. అలాగే ప్రభుత్వం తీసుకుంటున్న సానుకూల నిర్ణయాలతో ఒక కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారు చింతించకుండా ఒకవైపు ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ మరోవైపు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయాలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం చిన్న వయసులోనే కార్డియాక్ అరెస్టులు ద్వారా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో సిపిఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# సమన్వయంతో దేవుని బ్రహ్మోత్సవాలు జరిపిద్దాం

- భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు
- మాఢవీధుల్లో సాఫీగా ప్రవేశ నిష్క్రమణ మార్గాలు
- బ్రహ్మోత్సవాల సమీక్షలో అధికారులు



తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:

ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు సార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, ఈ ఉత్సవాలను అందరూ సమన్వయంతో కలసి పనిచేసి ప్రశాంతంగా జరిపిద్దామని టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర కోరారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణకు తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేద్దామని తెలిపారు. సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలను టిటిడి,జిల్లాయంత్రాంగం సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని ఈఓ అన్నారు.ఇందుకోసం అన్ని విభాగాల ,శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వతేదీతో ముగుస్తాయి. తొలిరోజే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రెండు బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి జేఈఓలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్, టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ ,తిరుమల అదనపు ఎస్పి ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, టిటిడి డిప్యూటీ ఈఓలు లోకనాథమ్, భాస్కర్,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి ,పిఆర్ఓ నీలిమ తదితర విభాగాల అధికారులతో కలసి ఇఓ సమీక్షించారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో భక్తుల రద్దీ, వాహన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఆరోగ్యం, పారిశుద్ధం, అన్నప్రసాదం, ఘాట్‌రోడ్ల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షి ంచినట్లు వివరించారు. ముఖ్యంగా గరుడసేవకు అధిక ప్రాధాన్యతనిస్తూ, తిరుమలతో పాటు తిరుపతిలోనూ భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఈ ఏడాది భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు వంటశాలల ఏర్పాటుతోపాటు అవసరమైన నిత్యావసర సరుకుల సేకరణ, రవాణా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు.

# కాపీయింగ్‌కు తావులేకుండా ఓపెన్ స్కూల్ విద్య

## ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఆర్. నరసింహారావు

తిరుపతి విద్య ఆగష్టు 20 ప్రభాత వార్త

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో కాపీయింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఆర్. నరసింహారావు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు స్వయంగా చదివి, అర్థం చేసుకుని పరీక్షలు రాసే సామర్థ్యాన్ని పెంపొందించాలని అన్నారు.తిరుపతి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏపీ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఏఐ కేంద్రాల సమన్వయకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆర్. నరసింహారావు అధ్యక్షత వహించగా జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్, డీవైఈఓలు, ఎంఈఓలు, ఓపెన్ స్కూల్ సమన్వయకర్తలు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థికి ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగించే అవకాశం కల్పించాలని నరసింహారావు అన్నారు. విద్యకు దూరమైన విద్యార్థులను గుర్తించి, వారు ఎక్కడ ఉన్నా వెతికి ఓపెన్ స్కూల్‌లో చేర్పించేందుకు ఎంఈఓలు, సమన్వయకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసుకోవడంతో పాటు ఉన్నత విద్యలో వివిధ కోర్సులను అభ్యసించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యాశాఖ తీసుకునే శాఖ కాదు.. సమాజానికి సేవ చేసే విభాగం అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు అందిస్తున్న అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని, ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలను పదేపదే రాయిస్తూ సాధన కల్పించాలని తెలిపారు. చదవడం, రాయడం అలవాటు పెంపొందితే విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించగలరని చెప్పారు.జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, విద్యకు దూరమైన అర్హులైన విద్యార్థులను అధిక సంఖ్యలో ఓపెన్




స్కూల్‌లో చేర్పించాలని ఎంఈఓలు, సమన్వయకర్తలకు సూచించారు.ప్రతి మండలంలో సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు ఓపెన్ స్కూల్ అవకాశాలను చేరువ చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సుధ, తిరుపతి డీవైఈఓ ఇందిరాదేవి, పుత్తూరు డీవైఈఓ మహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు, ఓపెన్ స్కూల్ సమన్వయకర్తలు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

# నోటీసుల పంపిణీకి బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించాలి...

..నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం. జయకృష్ణ...



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 20 ప్రభాతవార్త

భాగంగా ప్రస్తుతం నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకి నోటీసులను పంపిణీ చేస్తున్న అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్లు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ మరియు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో నగరపాలక సంస్థ కార్యాలయం లో 167 తిరుపతి నియోజకవర్గ నమోదు అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ రివిజన్లో భాగంగా ప్రస్తుతం నో మ్యాపింగ్ మరియు అనాలిసిస్ ఓటర్ల కి నోటీసులను అధికారులు పంపిణీ చేస్తున్నారని, ఈ సందర్భంలో బూతుల ఏజెంట్లు బిఎల్వోలకు సహకరించాలని తెలిపారు. అలాగే నిర్దేశిత ప్రాంతంలో నోటీసులో కనబరిచిన తేదీ నాటికి నోటీసులో కనబరిచిన తేదీ మరియు ఆ సమయానికి ఈసీఐ నిర్దేశించినటువంటి 11 డాక్యుమెంట్లలో 1987 ముందు పుట్టినట్లయితే ఒక డాక్యుమెంట్, 1987 మరియు 2004 మధ్యన పుట్టినట్లయితే రెండు డాక్యుమెంట్లు మరియు 2004 తర్వాత జన్మించినట్లయితే 3 డాక్యుమెంట్లను విచారణలో సదరు ఓటర్ సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ యొక్క 11 డాక్యుమెంట్లు ఏమేమి అని క్షుణ్ణంగా వివరించారు. కొత్తగా ఏర్పాటు చేసినటువంటి 84 పోలింగ్ కేంద్రాలకు బూతులు ఏజెంట్ యొక్క వివరములను సమర్పించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. పూర్తిగా నడవలేని వారు, హాస్పిటల్లో ఉన్నవారు మరియు వికలాంగులు వారికి వర్చువల్ ద్వారా ఏరియా కండక్ట్ చేయడం జరుగుతుందని, మిగిలిన ఓటర్లు అందరూ కూడా ఎవరైతే నోటీసులు తీసుకున్నారు వారు ఫిజికల్ గా అటెండ్ కావాలని తెలిపారు. ఇప్పటివరకు పంపిణీ చేసినటువంటి నోటీసుల యొక్క వివరములు మరియు బ్యాలెన్స్ వివరములను వివరించారు. రాజకీయ పార్టీ ప్రతినిధిలో సలహాలు, సూచనలను స్వీకరించి, పలు సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, తహసిల్దార్ సురేష్ బాబు, ఎన్నికల ఉప తహసిల్దారు సుధాకర్ నాయక్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంట తవ్వుతుండగా బయటపడ్డ మృతదేహం

## చేతులు కట్టివేసి.. మెడకు తాడు ఉండటంతో పలు అనుమానాలు
## హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు



రేణిగుంట, ఆగస్టు 20 ప్రభాతవార్త

రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఉన్న ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాల బాలుర హాస్టల్ వెనుక ఇంకుడు గుంట తవ్వుతుండగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వెలుగుచూడటం తీవ్ర కలకలం రేపింది. సుమారు 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మృతదేహం లభ్యమవగా, మృతుడి చేతులు కట్టివేసి ఉండటం, మెడకు తాడు ఉండటంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు హత్యా? ఆత్మహత్యా? అన్న కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.కళాశాల బాలుర హాస్టల్ వెనుక ఇంకుడు గుంట నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం కూలీలు గుంత తవ్వుతుండగా మట్టిలో మృతదేహం కనిపించింది. దీంతో వారు వెంటనే కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహం పరిస్థితిని బట్టి వ్యక్తి రెండు, మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహం చేతులు కట్టివేసి ఉండటంతో పాటు మెడకు తాడు ఉండటం అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. దీంతో పోలీసులు ఈ ఘటనను అనుమానాస్పద మృతిగా పరిగణించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు ఎవరు? ఆయన అక్కడికి ఎలా వచ్చారు? ఎవరైనా తీసుకొచ్చి అక్కడ పూడ్చిపెట్టారా? లేక మరేదైనా కారణంతో ఈ ఘటన జరిగిందా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కళాశాల ప్రతినిధుల ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, వీఆర్వో నళిని, మరో ఇద్దరు పెద్దల సమక్షంలో మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో దానిని తరలించడం ఇబ్బందికరంగా మారింది.ఈ నేపథ్యంలో మృతదేహం లభించిన ప్రదేశంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతుడి మరణానికి గల అసలు కారణం మరింత స్పష్టమయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ, గుర్తింపును కూడా పోలీసులు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పోలీసు అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేయాలని సూచించినట్లు తెలిసింది. మృతుడి గుర్తింపు, మృతదేహం లభించిన ప్రదేశం, చేతులు కట్టివేసి ఉండటం, మెడకు తాడు ఉండటం వంటి అంశాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించడంతో పాటు మృతుడి ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే ఈ ఘటన వెనుక ఉన్న అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# తిరుపతి డివిజన్

## అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి పోటీల గోడ పత్రిక ఆవిష్కరణ



**- శాప్ చైర్మన్ రవి నాయుడు**

**తిరుపతి క్రీడ, ఆగస్టు 20, ప్రభాతవార్త**

తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శాప్ చైర్మన్ రవి నాయుడు అమరావతి ఛాంపియన్షిప్ 2026 రాష్ట్రస్థాయి పోటీలకు సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియా మిత్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ 2026 రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 24 నుంచి 27 వరకు తిరుపతిలో నిర్వహించనున్నట్లు శాప్ చైర్మన్ రవి నాయుడు వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 వేల మంది క్రీడాకారులు అండర్-17, అండర్-23 విభాగాల్లో వివిధ క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. విజేతలు, రన్నర్స్‌కు కలిపి సుమారు రూ.92 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజయవాడలో విజేతలకు బహుమతులు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

**- స్పోర్ట్స్ ఫర్ ఆల్ లక్ష్యం:**

గతంలో క్రీడా దినోత్సవాలను కేవలం ర్యాలీలు, కార్యక్రమాలకే పరిమితం చేసేవారని, అందుకు భిన్నంగా ప్రతి ఒక్కరినీ క్రీడల వైపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్పోర్ట్స్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని రవి నాయుడు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ కార్యక్రమంలో సుమారు 28 వేల మంది పాల్గొన్నారని చెప్పారు. ఈ సారి నియోజకవర్గ స్థాయి నుంచి ప్రతిభావంతులను గుర్తించి రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకొచ్చామని, అండర్-17లో పాఠశాల స్థాయి విద్యార్థులు, అండర్-23లో యూనివర్సిటీ స్థాయి క్రీడాకారులకు అవకాశం కల్పించామని తెలిపారు.

**- తిరుపతిలో విస్తృత ఏర్పాట్లు :**

తిరుపతిలో క్రీడా మైదానాలు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండటంతోనే ఈ పోటీలకు తిరుపతిని ఎంపిక చేశామని తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, క్యాంపస్ స్కూల్, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర వేదికల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు, రిఫరీలు, కోచ్‌లు, పీఈటీలు తదితర సిబ్బందితో కలిపి సుమారు 14,500 మంది తిరుపతిలో బస చేయనున్నారని, క్రీడాకారులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం నుంచే చేరుకుంటారని తెలిపారు. ఆగస్టు 24న ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రతిరోజు షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటిస్తామని తెలిపారు.

**- క్రీడాకారులకు వారి స్థాయికి అనుగుణంగా ఉద్యోగాలు:**

క్రీడాకారులకు ఉద్యోగాల కల్పనపై వస్తున్న విమర్శలను రవి నాయుడు ఖండించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం అంటే ప్రతి ఒక్కరికీ ఒకే స్థాయి ఉద్యోగం ఇవ్వడం కాదని, వారు సాధించిన విజయాలు, క్రీడా స్థాయిని బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ విధానాన్ని వక్రీకరించి వైకాపా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గుర్తింపు పొందిన క్రీడల్లో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు ఇస్తున్నాం. పబ్‌జీ వంటి ఆన్‌లైన్ గేమ్‌కు గుర్తింపు పొందిన క్రీడా అసోసియేషన్, ఫెడరేషన్ లేనప్పుడు ఏ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలి అని ప్రశ్నించారు. క్రీడాకారుల ప్రతిభను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు చేరేలా మీడియా సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌ను భవిష్యత్ ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దే వేదికగా అభివృద్ధి చేస్తామని రవి నాయుడు తెలిపారు.

**- రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ కోసం క్రీడా మైదానాలు, ఏర్పాట్లు పరిశీలన:**

చివరిగా, ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతి వేదికగా నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026 రాష్ట్రస్థాయి పోటీలకు సంబంధించిన క్రీడా మైదానాలు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను శాప్ చైర్మన్ రవి నాయుడు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా, రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## భక్తికి వెంగమాంబ జీవితం ఆదర్శం



**తిరుమల,ఆగస్టు 20ప్రభాతవార్తప్రతినిధి:**

భక్తి, తపస్సుకు వెంగమాంబ జీవితం ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. తరిగొండ వెంగమాంబ - యోగ జీవనం" అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. వెంగమాంబ తన జీవితాన్ని స్వామివారి కైంకర్యానికి అంకితం చేసి భక్తి, తపస్సు, ఆత్మసాక్షాత్కారానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. గురువారం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. నేటి ఉదయం 9 గంటలకు ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న తరిగొండ వెంగమాంబ విగ్రహానికి టిటిడి అధికారులు పుష్పాంజలి సమర్పిస్తారు. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో సంగీత కచేరీ, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు హరికథ నిర్వహిస్తారు. తిరుమలలో రేపు ఉదయం 9 గంటలకు తిరుమలలోని తరిగొండ వెంగమాంబ బృందావనంలో ఉన్నతాధికారులు పుష్పాంజలి సమర్పించి ఆమెకు ఘన నివాళులు అర్పించనున్నారు.

## ముత్తూట్ ఫైనాన్స్ పై చర్యలు తీసుకోవాలి

**- నా భర్త ఆచూకి చెప్పండి - జి మధు భార్య భార్గవి వేడుకోలు**




**తిరుపతి హెల్త్,ఆగస్టు 20 ప్రభాతవార్త:**

తిరుపతి అర్బన్ బిటిఆర్ కాలనీ 14వ లైన్ నందు కాపురముండే జి మధును మంగళవారం రాత్రి 9:30 గంటలకు పోలీసులమని చెప్పి సుమారు 20 మందితో ఇంటి నుంచి తన భర్తను తీసుకెళ్లారని భార్య భార్గవి ఆరోపించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె మాట్లాడారు. ముత్తూట్ ఫైనాన్స్, బంగారం, నగదు లావాదేవీలకు సంబంధించిన వ్యవహారంపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా మధు మద్యం మత్తులో ఉండడం వలన అతడిని విడిచిపెట్టమని పోలీసులు చెబుతున్నారని, మధు వాడే మొబైల్ పోలీస్ స్టేషన్లో ఉండడం వలన అనేక అనుమానాలకు తావిస్తుందని వాపోయారు. పోలీసులు మధును నిజంగా విడిచిపెట్టారా? లేక ముత్తూట్ ఫైనాన్స్ కు సంబంధించిన వ్యక్తులకు అప్పగించారా? అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు? అనే విషయాలపై పోలీసులు ఇంతటి వరకు స్పష్టమైన సమాధానం చెప్పకపోవడం ఆందోళన కలిగిస్తుందని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి కే వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మధు తాపీ మేస్త్రీ పనిచేస్తూ, ఆటో నడుపుతూ, తనపై సుమారు పదిమంది ఆధారపడి జీవిస్తున్నారని, కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అందరూ తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఈ వ్యవహారం పై ముత్తూట్ ఫైనాన్స్ సంస్థకు చెందిన బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని వెంటనే మధును ఎవరు తీసుకెళ్లారు, ఎక్కడికి తీసుకెళ్లారు, ఎప్పుడు విడిచిపెట్టారు, ప్రస్తుతం అతను ఎక్కడ ఉన్నాడు, పోలీస్ స్టేషన్ నందు మొబైల్ ఎందుకు ఉందో! అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి నిజా నిజాలను వెలికి లోకి తేవాలని, మధు కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సిపిఎం తిరుపతి నగర కమిటీ అండగా నిలుస్తుందని పోరాడుతుందని చెప్పారు.

## అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మార్పు చేసుకోవాలి.!

**విజన్ టెక్ వ్యవస్థాపకుడు వినయ్ తేజ**




**రామచంద్రాపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త:**

అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మార్పు చేసుకోవాలని విజన్ టెక్ వ్యవస్థాపకులు వినయ్ తేజ అన్నారు. గురువారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూ ఏసి ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మశీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నాయని ఫార్మశీ రంగానికి ఉజ్వల భవిష్యత్ వుందని అన్నారు. డ్రగ్ డెవలప్‌మెంట్ ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, ప్లేస్‌మెంట్ సెల్ అధ్యాపకుడు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యతరగతి జీవితాలే

**ఇతివృత్తాలుగా వాస్తవికత చిత్రీకరణ**

**- మాలతీ చందూర్ ప్రత్యేకత**



**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్త:**

మాలతీ చందూర్ కథా సాహిత్యం మధ్యతరగతి జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకొని వాటిని వాస్తవికంగా చిత్రించిన వ్యక్తి మాలతీ చందూర్ అని వక్తలు పేర్కొన్నారు. ఆమె కథల్లో శిల్పం ప్రత్యేకమైనదని, సరళమైన సంభాషణల్లో కథను నడపటంలో ఆమె నిపుణులన్నారు. 50 ఏళ్లకు ముందు రాసిన విషయాలను నేటికీ వాస్తవాలైన తీరును ప్రశంసించారు. సాంకేతికత పెరిగినప్పటికీ మానవ సంబంధాలు పెంపొందించుకోవటానికి మాలతీ చందూర్ కథలను చదవాలన్నారు. మానవత్వం, మనిషితత్వం, ఉన్న కథలు అని ఆమె కథలని వాటిని చదవమని సూచించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో డాక్టర్ మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమం జి.హిమబిందు, సిహెచ్. లక్ష్మీ ప్రసన్న, సిహెచ్.ప్రవల్లి రాజరాజేశ్వరి ప్రబోధ గీతంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా తెలుగు శాఖ అధ్యక్షురాలు, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీన్ ఎస్.ఎస్.ఎస్.హెచ్ ఎం ఆచార్య పి.విజయలక్ష్మి ,డాక్టర్ డి.యువశ్రీ ,ఈ సమావేశంలో మన్నవ గంగాధర్ ప్రసాద్ ,ఆచార్య జె.నీరజ ,వివిధ కళాశాలలు, విభాగాల ఆచార్యులు, విద్యార్థులు సాహితీ ప్రియులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హామీతో పాఠశాలకు బోరు బావి డ్రిల్లింగ్ - ఎంపీపీ



**విజయపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త:**

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హామీతో మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం బోరు బావి డ్రిల్లింగ్ చేసినట్లు ఎంపీపీ లక్ష్మిపతిరాజు పేర్కొన్నారు. డ్రిల్లింగ్ చేసిన బోరుబావిలో నీరు పుష్కలంగా లభించిందనే సంతోసం వ్యక్తం చేశారు. గత నెలలో పాఠశాల ఆవరణలో ఎంపీపీ ఆర్థిక సౌజన్యంతో నిర్మించిన కళావేదిక ప్రారంభానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకి మంచినీటి సమస్యను గ్రామస్తులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవించారు. అందుకు ఎమ్మెల్యే అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు బోరు వేసి మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఇంజనీర్ ఈశ్వర్, ఎంఈవో శ్రీనివాసులు, మండల తెలుగుదేశం నాయకులు రమేష్‌రాజు, ఉపాధ్యాయులు సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## 2029లో రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని!

**-కాంగ్రెస్ నేతలు**



**తిరుపతి,ఆగస్టు 20ప్రభాతవార్త:**

ప్రధానమంత్రిగా దేశంలో ఆధునికతను, సాంకేతిక విప్లవానికి స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆద్యుడని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు కొనియాడారు. దేశంలో కంప్యూటర్లు, సెల్ ఫోన్లు ప్రతి ఒక్కరి వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాల వరకు రాజీవ్‌గాంధీ అందుబాటులోకి తెచ్చారని అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాంగాటి గోపాల్ రెడ్డి ,పిసిసి కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ ,పిసిసి మాజీ కార్యదర్శి సుప్రజ, పార్టీ సీనియర్ నాయకులు వెంకటరామయ్య, శివబాలాజీ, , గౌతమ్, దుగ్గాని రెడ్డెప్ప, పార్థసారథి రెడ్డి, తవన్ కళ్యాణ్, ముసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిది

**టీడీపీ మండల అధ్యక్షులు ఎంజర్ల నారాయణ రెడ్డి**

**పెనగలూరు( ఆగస్టు 20), ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనమలూరు మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని పెనగలూరు తెలుగుదేశం పార్టీ మండల ఇంచార్జీ ఎంజర్ల నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం పెనగలూరు మండలంలోని కొత్తపల్లి ముస్లిం కాలనీ కి చెందిన షేక్ షర్మిలకు రూ.41887, మరియు షేక్ గౌసియా కు రూ.22901 ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మైనార్టీ నాయకుడు షేక్ షామీర్ బాషా, తాటిబోయిన ధన, కోలా మురళి, డాక్టర్ రామకృష్ణయ్య, ఆదాల నవీన్, మరియు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగబాబుకు ఎమ్మెల్యే ఆరణి అభినందనలు



**తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాత వార్త**

ఏపీ గ్రీన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నూతనంగా నియమి తులైన నాగబాబును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుభాకాం క్షలు, అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేస్తూ గ్రీన్ సొసైటీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షి ంచారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చున్నారు. ఈ సందర్భంగా నాగబాబు తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రీన్ సొసైటీ లక్ష్యాల సాధనకు తన వంతు కృషి

## పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తి నివారణ

**ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి..!**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శిరీష**

**చంద్రగిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త:**




పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తి నియంత్రించవచ్చని చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహనా ర్యాలీ, ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం శుక్రవారం రోజును డ్రై డేగా పాటించాలని సూచించారు. మీ ఇంటి పరిసరాలలో నీటి నిల్వ లేకుండా తొలగించాలన్నారు. నీటి నిల్వ కారణంగా దోమలు ప్రబలి వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రోగాలు సోకే ప్రమాదం వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు సి.శివరాజు, ఎన్.వాసుదేవ రెడ్డి, ద్రాక్షాయణి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎంపిహెచ్ఎ (ఏ) సిబ్బంది, ఆశా వర్కర్లు, పాల్గొని దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు.

## మాంస ఉత్పత్తుల విలువ పెంచితే ఆదాయం పెరుగుతుంది

**ఉపకులపతి డా. జె.వి. రమణ**



**తిరుపతి విద్య ఆగస్టు 20 ప్రభాత వార్త**

మాంస ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులు, గ్రామీణ మహిళలు, యువత అదనపు ఆదాయాన్ని పొందవచ్చని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. జె.వి. రమణ అన్నారు. తిరుపతిలోని పశువైద్య విజ్ఞాన కళాశాల పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగంలో గ్రామీణ మహిళల కోసం విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీ మరియు మార్కెటింగ్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. జె.వి. రమణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వినియోగదారులు పరిశుభ్రంగా తయారు చేసిన, నాణ్యమైన, భద్రమైన ఆహార ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. సాసేజీలు, నగెట్స్, ప్యాటీస్, కబాబ్‌లు, పికిల్స్‌తో పాటు తక్షణ వంటకు, నేరుగా వినియోగించేందుకు అనువైన మాంస ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నస్థాయి మాంస ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు, యువత స్వయం ఉపాధి పొందడంతో పాటు కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఐసీఏఆర్‌నార్మ్, హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డా. గోపాల్ లాల్ మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణలో విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీకి సంబంధించిన పలు అంశాలపై శిక్షణార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పరిశుభ్రమైన మాంస ప్రాసెసింగ్ విధానాలు, ఉత్పత్తుల తయారీ, నాణ్యత నియంత్రణ, ఆహార భద్రత ప్రమాణాలు, ప్యాకేజింగ్, లేబులింగ్, మార్కెటింగ్ వంటి అంశాలను సైద్ధాంతిక, ప్రాయోగిక పద్ధతుల్లో వివరించినట్లు పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమ డైరెక్టర్, పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగాధిపతి డా. జి. విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నిపుణుల ఉపన్యాసాలు, ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్రాయోగిక శిక్షణ ద్వారా వివిధ విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చిన్నస్థాయి మాంస ప్రాసెసింగ్ యూనిట్లలో ఉపయోగించే ఆధునిక యంత్ర పరికరాల పనితీరును కూడా శిక్షణార్థులకు ప్రత్యక్షంగా వివరించినట్లు చెప్పారు. ఐసీఏఆర్‌నార్మ్ ఎస్సీ ఎస్పీ నోడల్ అధికారి డా. ఎం. బాలకృష్ణన్, పశువైద్య విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. మాలకొండయ్య మాట్లాడుతూ మాంస ప్రాసెసింగ్ సాంకేతికతలు, వ్యాపార అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించేలా శిక్షణను రూపొందించినట్లు తెలిపారు. రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కొత్త ఉపాధి మార్గాలను సృష్టించుకోవాలని సూచించారు. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న వారికి ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి, కార్యక్రమ అధ్యక్షుల చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు బి. శోభామణి, డా. ఆర్.వి. సురేష్ కుమార్, డా. కె. సుధీర్, డా. జెడ్. నవీన్, డా. బి. రాంబాబు నాయక్, డా. బి. రంగమ్మ, ఈ. తిరుపతి రెడ్డి తదితర అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## వెనకబడిన వర్గాల వెన్నుముక తెలుగుదేశం పార్టీ





పెళ్లకూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాలను, వెనకబడిన వర్గాలను రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా చైతన్యవంతులను చేసి ఆదుకున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అలాంటి పార్టీని ఆదరించకపోతే వెనుకబడిన వర్గాలకు భవిష్యత్తు ఉండదని మండల తెదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం వెనకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై మండలంలోని తెదేపా కార్యాలయం నందు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకాలు చేసి,స్వీట్లు పంచుకుని, పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలోని బిసి నాయకులు మాట్లాడుతూ మాకు 34 శాతం రిజర్వేషన్ కల్పించిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తేదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్, సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, పేరం మధు నాయుడు, కిలారి గోపి యాదవ్, కేవీ నాయుడు,పునబాక పోలయ్య, ప్రసాద్ నాయుడు, తాళ్ల యుగంధర్ తాళ్ల రెడ్డి శ్రీనివాస్, పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## వేనాడు దర్గాలో కొండేపాటి గంగా ప్రసాద్



సూళ్లూరుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: అత్యంత ప్రాశస్తి కలిగిన తడ మండలం వేనాడు దర్గాకు ప్రముఖ పారిశ్రా మికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం తో కలసి వెళ్ళి గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా వేనాడు దర్గాలో ఉన్న సమాధి దర్శించుకుని సమాధి విశిష్టత గూర్చి వివరాలు తెలుసుకొన్నారు. దర్గా అభివృద్ధి తన వంతు సహకార మందిస్తానని కొండే పాటి గంగా ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేస్త కార్పొరేషన్ చైర్మెన్ బొమ్మన శ్రీధర్, పళణి, ఏ కాంబరం, జైపూల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నాగబాబుకు పదవి పట్ల జనసేన సంబరాలు

సూళ్లూరుపేట, ఆగస్టు 20 ప్రభాతవార్త: జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు క్యాబినెట్ ర్యాంకు పదవి అయిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించడాన్ని స్వాగతిస్తూ సూళ్లూరుపేటలోని జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా కేక్ను కట్ చేసిపంచి పెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జనసైనికులు, వీర మహిళలు ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటారని జనసేన పార్టీ నాయకులు మా భాష వెల్లడిం చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నక్కా హరిబాబు, వల్లూరు రాజా, కోటయ్య యాదవ్, ఆవుల దాస్, ఏంబేటి ప్రవీణ్, ఆర్ జనార్ధన్, యశ్వంత్, మధుసూదన్ రావు, రామ్మూర్తి, చిరంజీవి, నరేష్, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## షుగర్స్ రైతుల బకాయిల చెల్లింపునకు చర్యలు

**: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 20 ప్రభాతవార్త : సూదలగుంట షుగర్స్ యూనిట్-1, యూనిట్-2కు సంబంధించి రైతులకు, రవాణా కాంట్రాక్టర్లు, హార్వెస్టింగ్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన ఇప్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి రైతుల బకాయిల అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సూదలగుంట షుగర్స్‌కు సంబంధించి గతంలో ఉన్న బకాయిలు, ప్రస్తుతం చెల్లించాల్సిన మొత్తాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, బకాయిల వసూలుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.2018-19 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి సుమారు రూ.30 కోట్ల మేర రైతులకు బకాయిలు ఉండగా, 2022లో అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు చేపట్టి, ఊతుకోటలోని సుమారు 106 ఎకరాల భూమిని వేలం ద్వారా విక్రయించి రైతులకు సుమారు రూ.15 కోట్ల వరకు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం అదనపు చెరకు ధరతో కలిపి సూదలగుంట షుగర్స్ యూనిట్-1, యూనిట్-2కు సంబంధించి రైతులకు సుమారు రూ.27 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, అదేవిధంగా రవాణా కాంట్రాక్టర్లు, హార్వెస్టింగ్ కార్మికులకు మరో రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. బకాయిల వసూలుకు సంబంధించి నమోదైన చెక్ బౌన్స్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన అంశాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ డిప్యూటీ కేన్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతుల బకాయిల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ సుబ్బారాయుడితో ఈ అంశంపై కలెక్టర్ చర్చించారు. కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ను చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ, ఎన్ బి డబ్ల్యు అమలుకు తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.ఈ సమావేశంలో డిప్యూటీ కెన్ కమిషనర్ జాన్ విక్టర్, సూదలగుంట షుగర్స్‌కు సంబంధించిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ మార్నింగ్ పెళ్లకూరును...అడ్డుకున్న కూటమి నాయకులు



పెళ్లకూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త : వైఎస్ఆర్‌సిపి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా జరుగుతున్న గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమంను పునబాక గిరిజన కాలనీలో స్థానిక కుటమి నాయకులు అడ్డుకున్నారు. మాజీ ఎన్‌డిడిసిబి చైర్మన్ వైయస్సార్‌సిపి నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తలపెట్టిన ఈ గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమం గత రెండు రోజులుగా సవ్యంగా జరిగినప్పటికీ మూడవరోజు పునబాక గిరిజన కాలనీలో స్థానికంగా ఉన్న కూటమి నాయకులు అడ్డుకుని మండలంలో ఉన్న వైసీపీ నాయకులందరినీ తీసుకుని వచ్చి కూటమి ప్రభుత్వంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ సత్యనారాయణరెడ్డితో వాగ్వివాదానికి దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటన గురించి విషయం తెలుసుకున్న రూరల్ సీఐ సంగమేశ్వర రావు ఎస్ఐ ఆదిలక్ష్మి పోలీసులతో అక్కడికి చేరుకుని స్థానికేతరులైన వైసీపీ నాయకులను కార్యకర్తలను కొంత మందిని అదుపులోకి తీసుకోగా ఈ ఉద్రిక్తత పరిస్థితులు నడుమ సత్యనారాయణరెడ్డి తన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పూర్తి చేసుకున్న, అనంతరం చిల్లకూరులోని తన నివాసం వద్ద గల వైయస్ ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కూటిమి నాయకుల దౌర్జన్యంపై విరుచుకుపడ్డాడు. కూటమి ప్రభుత్వ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే నా ఈ గుడ్ మార్నింగ్ పెళ్లకూరు కార్యక్రమంను అడ్డుకోవాలని ఆటంకాలు సృష్టిస్తు న్నారని, నేను నా ఈ కార్యక్రమంలో ఏ పార్టీని విమర్శించడం లేదని నా వైఎస్ఆర్సిపి పార్టీని బలపరచమని మాత్రమే ప్రజలను అభ్యర్థిస్తు న్నానని వైయస్సార్సీపి పార్టీకి ప్రజల్లో వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి ఆటంకాలు సృష్టిస్తున్నారని ఎన్ని ఆటంకాలు సృష్టించిన నేను ఈ గుడ్ మార్నింగ్ కార్యక్రమంను పూర్తిచేసే తీరుతానని అన్నారు.

## అర్హత కల్గిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు

**- అనామలీస్, నో మ్యాపింగ్ కేసులను విచారించిన జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు**




చిత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త: ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. చిత్తూరు సంజయ్ గాంధీ నగర్‌లోని సరస్వతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పోలింగ్ కేంద్రం 65 వద్ద జరుగుతున్న ఓటర్ల జాబితా విచారణ కార్యక్రమంను గురువారం జిల్లా ఎలక్టోరల్ పరిశీలకులు మల్లికార్జున్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1.34 లక్షలకు పైగా అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు సంబంధించి విచారణ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. నోటీసులు అందుకున్న వ్యక్తులకు నిర్దిష్ట తేదీ, సమయం, ప్రదేశంను కేటాయించి విచారణ నిర్వహిస్తామన్నారు. సంజయ్‌గాంధీ నగర్ పోలింగ్ స్టేషన్ పరిధిలో సుమారు 50 మంది నోటీసులు అందుకున్న వ్యక్తులు అవసరమైన ఆధారాలతో విచారణకు హాజరయ్యారన్నారు. విచారణ సందర్భంగా బిఎల్ఓలు, ఏఇఆర్ఓలు, ఇఆర్ఓలు, డిఆర్ఓ అధికారులు అందుబాటులో వుండి, ఓటర్లు సమర్పించిన ఆధారాలను పరిశీలిస్తున్నారన్నారు. అనామలీస్ కేసుల్లో ఓటరు పేరు, వయస్సు, స్పెల్లింగ్ తదితర వివరాల్లో ఏదైనా వ్యత్యాసాలు వున్నాయా! అనే అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. అలాగే నో మ్యాపింగ్ కేసుల్లో సంబంధిత ఓటరు ఎందుకు నో మ్యాపింగ్ కింద వున్నారు! అందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించారా! అనే అంశాలను పరిశీలిస్తున్నా మన్నారు. అలాగే సరైన ఆధారాలు సమర్పించిన కేసుల్లో వాటిని మళ్ళీ స్కాన్ చేసి ఈసిఐ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. విచారణ ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా జరుగుతున్నదనే దానికి ఆధారంగా విచారణకు హాజరైన ఓటరుతో బిఎల్ఓ కలిసి వున్న ఫోటోను అప్‌లోడ్ చేసే విధంగా ఈసిఐ ప్రత్యేక అస్యూరెన్స్ మెకానిజంను ఏర్పాటు చేసిందన్నారు. మున్సిపాల్టీ పరిధిలో 107 దరఖాస్తులను విచారణ నిర్వహించగా 94 వినతులను పరిష్కరించడం జరిగిందన్నారు. అలాగే విచారణకు హాజరైన ఓటర్లతో స్వయంగా మాట్లాడితే వారు విచారణ ప్రక్రియపై సంతృప్తి చెందారన్నారు. జిల్లాలో సెప్టెంబర్ 21వ తేదీలోపు నోటీసులు జారీ చేసిన అన్ని కేసుల్లోను విచారణ ప్రక్రియను పూర్తి చేస్తామని మల్లికార్జున్ పేర్కొన్నారు. మొదటి విచారణకు ఎవరైనా హాజరు కాకుంటే వారికి రెండవ సారి కూడా నోటీసులు జారీ చేసి విచారణకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, డిఆర్ఓ కె.మోహన్‌కుమార్, చితఊత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులునాయుడు, ఎన్నికల డిప్యుటీ తహసిల్దారు హిమగిరి, మున్సిపల్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మన పని మన దైవం... అనే విధంగా విధులు నిర్వహించండి

**నగరంలో పారిశుద్ధం, సుందరీకరణ పనులు చురుగ్గా చేపట్టండి**

**కమిషనర్ ఎం. జయకృష్ణ**

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 20 ప్రభాతవార్త: నగరపాలక సంస్థలో పనిచేసే వారు పనియే ప్రత్యక్ష దైవంగా భావించి తమ విధులను అంకితభావంతో నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం ఉదయం నగరంలోని గాంధీ రోడ్డు, మంచాల వీధి, పి.పి.చావడి, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసం, రైల్వేస్టేషన్, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుద్ధం అధ్వానంగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు, ప్రజల రద్దీ ప్రాంతాల్లో పారిశుద్ధం పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగ్గా చేపట్టేందుకు రెండు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరంలో రోడ్లపైన ఎక్కడా చెత్త కనపడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. నగరంలోని అన్ని కూడళ్ళలో, డివైడర్ల మధ్యలో ఎండిన మొక్కలను, చెత్తను తొలగించి కొత్త మొక్కలను నాటించాలని తెలిపారు. ముఖ్యంగా అన్ని కూడళ్ళలో రంగురంగుల పూల మొక్కలను నాటించి సుందరంగా తీర్చి దిద్దాలని అధికారులకు ఆదేశించారు. అలాగే డివైడర్లకు పెయింటింగ్స్ వేయించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి మన పని మన దైవం అనే భావనతో విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా... వినాయక విగ్రహాల నిమజ్జనం సెప్టెంబర్ 20 లోపు పూర్తి కావాలి

**జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్ట్ 20 ప్రభాతవార్త : వినాయక చవితి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఒకే సమయంలో జరుగుతున్న నేపథ్యంలో రెండు ప్రధాన కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం పై జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎం.జయకృష్ణ లతో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వినాయక చవితి కార్యక్రమాలు సెప్టెంబర్ 14వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయని, అదే సమయంలో గౌరవ ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం తిరుపతికి రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, ప్రజల రాకపోకలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన గరుడ సేవ రోజున భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ఆ రోజుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. వినాయక నిమజ్జన కార్యక్రమాల సమయాలు, శోభాయాత్ర మార్గాలు, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపులు తదితర అంశాలను ముందుగానే సమన్వయం చేసుకోవాలని సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల దృష్ట్యా తిరుపతి పట్టణంలో వినాయక నిమజ్జనం కార్యక్రమం 1, 3, 7వ రోజులైన సెప్టెంబర్ 14, 16, 20వ తేదీలలో లోపు పూర్తి చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రధాన నిమజ్జన కార్యక్రమం వినాయక సాగర్ వద్ద నిర్వహించడంతో పాటు, దామినేడు, తూకివాకం, చెన్నయ్యగుంట చెరువులను ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలుగా గుర్తించి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి కార్యక్రమాల నిర్వహణలో మున్సిపల్‌శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మొత్తం కార్యక్రమాలపై సమగ్ర పర్యవేక్షణ, సమన్వయం చేపట్టాలని సూచించారు. నిమజ్జన ఘాట్లు, శోభాయాత్ర మార్గాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, ట్రాఫిక్, తాత్కాలిక సదుపాయాలు, ప్రజా భద్రత తదితర అంశాలపై సంబంధిత శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, క్రేన్లు, బారికేడింగ్, ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు తదితర భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా చెరువుల వద్ద ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రజలు నీటిలోకి వెళ్లకుండా తగిన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్/ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు స్థానిక శిక్షణ పొందిన ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఎస్పీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ వినాయక విగ్రహాల శోభాయాత్రలకు సంబంధించి ముందుగానే రూట్ మ్యాప్ సిద్ధం చేసి, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్, జన సమూహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన విగ్రహాలను తరలించే వాహనాల డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వాహనాలు మార్గమధ్యంలో నిలిచిపోయిన సందర్భాల్లో వెంటనే తొలగించేందుకు టోయింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వినాయక సాగర్‌తో పాటు ఇతర నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షి ంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, అడిషనల్ ఎస్పి లు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 రిజర్వేషన్ పునరుద్ధరణ

**రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ**

**- గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అమలు**

తిరుపతి రూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త: రాబోయే పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ వర్గాలకు 34 రిజర్వేషన్‌ను పునరుద్ధరించుతూ పంచాయతీ రాజ్ గ్రామీణా భివృద్ధిశాఖ జి.ఓ.ఎంఎస్ నం.105 విడుదల చేసింది. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లలో సభ్యులు మరియు పదవులకు బీసీలకు ఇచ్చే రిజర్వేషన్‌ను మళ్లీ 34 కు పెంచాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. గతంలో ఇది 24.15 కు తగ్గించబడినట్లు గుర్తించిన ప్రభుత్వం, తాజా ఉత్తర్వులతో మళ్లీ పాత స్థాయికి తీసుకొచ్చింది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల పదవీకాలం ముగియడంతో కొత్త ఎన్నికలు నిర్వహించడం అత్యవసరంగా మారింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం- 1994లోని వివిధ సెక్షన్ల ప్రకారం (సెక్షన్ 9, 15, 152, 153, 180, 181) బీసీలకు రిజర్వేషన్ కల్పించే అధికారం ప్రభుత్వానికి ఉంది. 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థలను సమయానికి ఏర్పాటు చేయడం చాలా అవసరం. దీనివల్ల కేంద్ర నిధులు పొందే అవకాశం ఉంటుంది. అందుకే ఎన్నికలను త్వరితగతిన నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రిజర్వేషన్ గ్రామ పంచాయతీలు, మండల మరియు జిల్లా స్థాయి సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. బీసీల రాజకీయ ప్రతినిధిత్వాన్ని పెంచే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇటీవల ఈ నిర్ణయంపై న్యాయపరమైన చర్చలు కూడా మొదలయ్యాయి. 50 రిజర్వేషన్ పరిమితి, ట్రిపుల్ టెస్ట్ వంటి అంశాల నేపథ్యంలో ఈ అంశం కోర్టులో సవాళ్లకు దారితీయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు మొత్తం మీద, పంచాయతీ ఎన్నికల ముందు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది.






## ప్రజలకు ఉపయోగపడేలా సబ్ వే నిర్మించండి

**రైల్వే ఎడిఆర్ఎంకు టిడిపి వినతి**



పుత్తూరు, ఆగస్టు 20 ప్రభాతవార్త : ప్రజలకు ఉపయోగంగా వుండేలా పట్టణంలోని ద్రౌపది దేవి గుడి వద్ద రైల్వే సబ్ వే నిర్మించాలని కోరుతూ గురువారం పుత్తూరు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వచ్చిన రైల్వే చెన్నై డివిజన్ ఎడిఆర్ఎం సెంథిల్‌కుమార్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని శాంతి థియేటర్ వద్ద సబ్ వే నిర్మించాలని రైల్వే అధికారులు నిర్ణయించారని ఆ మేరకు నిధుల విడుదల, డిజైన్ రూపకల్పన పూర్తయిందని ఎడిఆర్ఎం టిడిపి నాయకులకు స్పష్టం చేశారు. శాంతి థియేటర్ వద్ద నిర్మాణానికి రూ. 2.40 కోట్లు సరిపోతాయని, టిడిపి నాయకులు చెప్పిన చోట నిర్మించేందుకు రూ. 5 కోట్ల రూపాయలకు పైగా ఖర్చవుతుందని తెలిపారు. పలుమార్లు తమ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన విజ్ఞప్తుల మేరకు రైల్వే శాఖాధికారులు సబ్ వే నిర్మాణాన్ని మంజూరు చేశారని, అందువల్ల ఎంత ఖర్చయినా శాంతి థియేటర్ వద్ద కడితే ప్రయోజనం వుండదని, వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా ద్రౌపది దేవి గుడి లేదా ఆనంభట్టు రోడ్డు ప్రారంభమయ్యే చోట పాత రైల్వే క్యాబిన్ వద్దయినా నిర్మించాలని టిడిపి నాయకులు కోరారు. ఉన్నత స్థాయిలో ప్రయత్నిస్తే తప్ప సబ్ వే నిర్మాణ స్థలాన్ని మార్చలేమని ఎడిఆర్ఎం తేల్చి చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, సీనియర్ నాయకుడు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీద్రౌపదీదేవి శ్రీ ధర్మరాజు స్వామి ... వార్షిక బ్రహ్మోత్సవాలు



పుత్తూరురూరల్, ఆగస్టు 20 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వార్షిక బ్రహ్మోత్సవ సందర్భంగా ఆలయంలో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలు ఉత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ.వి.సుభాష్, మధ్యాహ్నం 3 గంటలకు పుత్తూరు శ్రీ గీతాసేవా సమాజం వారి ఆధ్వర్యంలో ద్రౌపదీ మాన సంరక్షణ సమయమున శ్రీద్రౌపదీ దేవికి శ్రీకృష్ణ పరమాత్మ కానుకగా నూతన వస్త్రాలు సమర్పించారు. సైంధవ రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయ దాతగా పార్వతమ్మ ఉమామహేశ్వరి కె.ఎస్.చంద్రిక ఎన్నెందుమతి సాయంత్రం 6 గంటలకు తవణం పల్లకి ఉత్సవం కార్యక్రమం ఆనంగి కృష్ణయ్య కుమారులు ఆనంగి రవిబాబు, ఆనంగి ఆనంద్ కీర్తిశేషులు ఆనంగి కృష్ణయ్య గారి మనవరలు ఆనంగి పల్లవి, ఆనంగి ధనుశ్రీ, రాత్రి హంస వాహనం కార్యక్రమం ఉభయ దాతగా కీర్తిశేషులు బి.ఎం.చిన్నబ్బ మేస్త్రి కుమారుడు కీర్తిశేషులు బీసీ రాజా, మాజీ కౌన్సిలర్ మాజీ చైర్మన్ శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి దేవస్థానం వారి కుమారులు మాజీ మున్సిపల్ చైర్మన్‌యుగంధర్,మున్సిపాలిటీ కాంట్రాక్టర్ బి.ఆర్.మురళీకృష్ణ వారి కుటుంబ సభ్యులు సింహ వాహనంపై ఉభయదాతగా పైడిపల్లి గ్రామానికి చెందిన నాగ మునిరెడ్డి వ్యవహరించారు.


Municipal Administration Department

**VENKATAGIRI MUNICIPALITY**

**'e'-procurement Notice**

**Roc. No.59/2020/E1** **Dated: 20-08-2026**

**Grant : UPHC**

**Estimate Contract Value Rs. 21.06 lakhs**

IFB. No. 02/VMC/MPLTY/2026-27

Nature of work: Construction of Dr.YSR Urban Clinic (Urban Primary Health Center) near Busuthota belongs to Old Sivalayam for imcompletion work in Venkatagiri Municipality.

**Bid Document download Start Time & Date : 10.30 AM on 20-08-2026**

**Bid Document download End Time & Date : 04.30 PM on 03-09-2026**

**Bid Submission Closing Time & Date : 05.00 PM on 03-09-2026**

Further details can be seen @ 'e' procurement market place @ "www.eprocurement.gov.in" Mobile No. 9052012759

**Sd/-Commissioner,**
**Venkatagiri Municipality**

